# కానుక

శ్రీమతి గోపరాజు సత్యవతిగారు

అమరకాంతుడు అత్తవారింటికి వెళ్ళే సరంధాళీలో వున్నాడు. యీ సందడిలో మైకూలాల్ అతనితో చదరంగం ఆడదామని వచ్చాడు. ఎన్నివిధాల ప్రాధేయపడ్డా అమరకాంతుడు చదరంగం ఆడటానికి అంగీకరించలేదు.

వివరమడిగి వ్యవహారం సవిస్తరంగా తెలిసికొన్నాడు. అమరకాంతుడు అత్తవారింటికి వెళ్లడం యిదే ప్రథమం. యీ కారణంగా అతడు యేదైనా తన భార్యకోసం కానుక తీసికొని వెళ్లాలి. కాని యీ సంగతి అతని దృష్టిలో లేదు. మాటల సందడిలో మైకూలాల్ యేదైనా బహుమతి తీసికొని వెళ్లకపోతే మాటదక్కదని ముక్తసరిగా చెప్పాడు.

మైకూ, అమరకాంతులు తర్జనభర్జనచేసి చిట్టచివరికి అప్పుడే అచట బండి దిగుతూకనిపించిన పారసీవనిత కట్టుకొన్న చీరలాటి చీర కొనటానికి నిర్ణయం చేశారు. ఆ చీర యెక్కడ దొరుకుతుందని వాకబుచేస్తే హాసింకొట్లో దొరుకుతుందని తెలిసింది. గాని దురదృష్టవశాత్తు అక్కడ విదేశీ వస్త్ర బహిష్కరణ; 'పికెటింగు' జరుగుతోంది. గాని చీరకొనడం తప్పని సరిగా భావించి అమరకాంతుడు బజారుకి పోయాడు. అదృష్టం కొద్దీ కొట్లోకి వెళ్లేటపుడు అక్కడ స్వయంసేవకులు లేరు. చీరకొని కాగితంకట్టి చంకలో పెట్టుకొని వీధిలోని కొచ్చేసరికల్లా వాలంటీర్లు చుట్టేశారు. వాలంటీర్లు చమత్కారంగా పేకెట్టు లాక్కొని మాయంచేశారు. మార్గస్థులు కొందరు అమరకాంతుణ్ణిచూచి యీసడించుకొన్నారు.

ఇంతలోనే ఒక యువతి దళసరి ఖద్దరుచీర ధరించి, చేత్తో ఒక సంచి పుచ్చుకొని అక్కడికి తయారైంది. వచ్చేరావడంతోనే "ఏమిటీ గందరగోళం?" అని వాలంటీర్లతో అంది. ఆమెను చూడ్డంతోనే వాలంటీర్లంతా కుక్కినపేలల్లాగ మాటాడలేదు. ఆమెతో అమరకాంతుడు చీర గురించి మొరపెట్టుకొన్నాడు.

ఒక సేవాదళ భటుణ్ణి పిలిచి విషయమడిగింది. ఆ వాలంటీరు విదేశవస్త్ర బహిష్కరణోద్యమానికి విరుద్ధంగా విదేశీ గుడ్డ దొంగతనంగా కొనుక్కుపోతూ, యెంత బ్రతిమాలినా వినలేదని బదులు చెప్పాడు.

వాలంటీర్లను మందలించి అతః చీర తెప్పించి అతనికిచ్చేసింది. అమరకాంతుడు ఆమెకు ధన్యవాదాలర్పించాడు. అప్పుడు ఆమె యెత్తి పొడుపుగా అంది "ఈ చీర యింత పట్టుదలతో యెందుకు కొన్నారండీ?"

అమరకాంతుడు సిగ్గుపడి తొట్రుపాటుతో "నాకోసం కాదు. నా భార్య తెచ్చిపెట్టమంది." అన్నాడు. ఆమె కుశల ప్రశ్నలకు ప్రారంభించింది.

"మీరు యేపేటలో వుంటున్నారండీ?" అని ఆమె ప్రశ్న.

"స అదత్‌గంజ్ పేటలో" అని అమరకాంతుని సమాధానం.

"మీపేరు?" అని ఆమె ప్రశ్నించడమే తడవుగా "అమరకాంతుడంటారు" అని నిష్కర్షగా చెప్పేశాడు.

అంతలో ఆమె సిగ్గుపడింది. మేలి ముసుగుముందుకి సర్దుకొని తలవంచేసుకుంది. చిరునవ్వుతో ఆమె మెల్లగా "ఇంట్లో మీ యిల్లాలు లేదుకదా; మరియింక భార్య యెవరు?" అని ప్రశ్నించింది.

అమరకాంతుని గుండెలు మోకాళ్లవఱకు జారిపోయాయి.

ప్రేమచంద్ కథ

ప్రశ్నకు యెదురుప్రశ్నగా కంఠం సర్దుకుంటూ "ఐతే మీరే పేటలో వున్నారండీ?" అని ఆమెను అడిగాడు. "ధనియారీ బజారులో" అంది ఆమె. అతని అనుమానం తీరిపోయింది. "నీపేరు సుఖదాదేవి కాదుకదా?" అన్నాడు. అందుకు సమాధానంగా ఆమె "కావచ్చు; యీ పేరుగల వాళ్లు చాలమంది వుంటారుకదా?" అంది. అమరకాంతునకి అంతా అర్థమైంది. ఆమె తన భార్యేనని తెలిసిపోయింది. జేబులోంచి అగ్గిపెట్టెతీసి ఆమెముందే ఆ చీరకు నిప్పుముట్టించి పారేశాడు. సుఖద "యీవేళ తప్పకరండి" అని చరచరా వెళ్లిపోయింది.

నాడు హోళీపండుగ. ఆవేళ పికెటింగు మంచి బందోబస్తుగా జరుగుతోంది. దాంట్లో అమర కాంతుడుకూడ త్రివర్ణపతాకతో, ఖద్దరు గుడ్డలు కట్టుకొనివున్నాడు.

ఇంతలోకే బర్రుమని పోలీసు లారీ వచ్చేసింది. సర్కిల్ కారు దిగి అక్కడున్న వాళ్లనందరినీ అరెష్టుచేసి కారులో యెక్కించాడు. అమరకాంతుడుకూడ అందరితోపాటు చిరునవ్వుతో వెళ్లి కారులో కూర్చున్నాడు. సుఖద యెక్కడనుంచో చేతుల్లో పుష్పమాలతో పరుగెత్తుకొచ్చింది. లారీ బయలుదేర బోయింది. సుఖద కారెక్కి దండ అమరకాంతుని మెడలో వేసింది. అమరకాంతుడు రెండు ఆనంద భాష్పాలు రాల్చాడు. కారులోంచి 'వందేమాతరం!' ధ్వని మిన్ను ముట్టుతోంది. కారు వెళ్లిపోయింది. యిదీ ఒక హోళీయే—ఇదీ ఒక కానుకే కాబోలు!!

పికెటింగ్‌కు అంతరాయం కలుగలేదు. గాని పికెటింగులో పాల్గొన్నవారెవరు? ఒక్క సుఖదమాత్రమే. హౌసింకొట్టు మెట్టుమీద నిలబడి గంభీరకంఠంతో ఆమె "విదేశ వస్త్రాన్ని కొనడమన్నా—కట్టుకోడమన్నా దేశద్రోహం" అంటోంది.

★


గ్రైప్ సిరప్




తయారు చేయువారు

మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లెబొరేటరీ లిమిటెడ్,

మల్లేశ్వరం, బెంగుళూరు

గ్రైప్ సిరప్ చంటిపిల్లలకు, శిసువులకు బాధలేని, హాయి అయిన విరేచనకారి. పిల్లల ఆరోగ్యాన్ని గురించి కాస్తఅనుమానం తగిలితే, ఒక మోతాదు గ్రైప్ సిరప్ యివ్వండి.

ఏడ్చు వారిని నవ్వించును

I·T·L

సెల్లింగ్ ఏజెంట్లు:

బెస్ట్ అండ్ కో., లిమిటెడ్

P. B. నెం. 63 మద్రాసు.